అంతా భ్రాంతియేనా.. ?

- ఊసేలేని నిరుద్యోగ భృతి
- నెల రోజులు దాటినా కనపించని స్పందన
- కూటమి మేనిఫెస్టో సూపర్ సిక్స్‌లో ప్రతి నిరుద్యోగికి రూ. 3 వేలు ప్రకటన
- చీరాల నియోజకవర్గంలో 40 వేల మంది నిరుద్యోగుల ఎదురుచూపులు
- 2014 ఎన్నికల హామీగానే మిగిలి పోతుందా..?

చీరాల:

ఇంటికో ఉద్యోగం.. 20 లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయం మమ్మల్ని నమ్మండి అంటూ శిరసు వంచి నమస్కరించి నిరుద్యోగులతో కూటమి ప్రభుత్వం ఓట్లు వేయించుకుంది. అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం పాతధోరణే అవలంభిస్తోందని నిరుద్యోగుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది. 2014లో కూడా ఇలానే హామీ ఇచ్చి మోసం చేసి ఎన్నికల ముందు చివరి రెండు నెలల్లో తూతూ మంత్రంగా ఇచ్చి మోసం చేసింది. మళ్లీ ఇప్పుడు అదేవిధంగా చేయడానికి సిద్ధంగా ఉందనేది స్పష్టంగా కనిపిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాల్లో ముందు ప్రాధాన్యతగా నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి రూ. 3 వేలు ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నిరుద్యోగ భృతిపై కనీసం విధివిధానాలు కూడా చేపట్టలేదు.

ఉద్యోగం వచ్చేంత వరకు భృతి..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెల రోజులు అవుతున్నా నిరుద్యోగ భృతిపై ప్రభుత్వం నోరు మెదపక పోవడం నిరుద్యోగులు ఆందోళనకు గురి చేస్తుంది. ఇప్పటికే తల్లికి వందనం ఇంటింటికి పెన్షన్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాల్లో ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు.



కూటమి మేనిఫెస్టోలో ఇచ్చిన నిరుద్యోగ భృతి హామీ

ఇవేగాక రైతులకు రైతు భరోసా, మత్స్యకార భరోసాలు వంటి పథకాలు పట్టించుకోలేదు. ప్రస్తుతం యువత ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నారు. వేలాది మంది విద్యార్థులు ఉద్యోగాల కోసం కోచింగ్ తీసుకుంటున్నారు. దీంతో ప్రభుత్వం ఇచ్చే భృతితో పోటీ పరీక్షల్లో రాణించవచ్చని ఆశిస్తున్నారు. సూపర్ సిక్స్ పథకాల్లో కూటమి ప్రభుత్వం పెద్దపీటవేస్తారని భావించారు. నిరుద్యోగులకు ఉద్యోగకల్పనతో పాటు, ఉద్యోగం వచ్చేంత వరకు నిరుద్యోగులకు ప్రతి నెల రూ. 3 వేలు ఇస్తామని ఎన్నికల హామీల్లో నమ్మబలికారు. భృతి కానీ, జాబ్ క్యాలండర్‌పై ఈ ప్రభుత్వం పట్టీ పట్టనట్లుగా వ్యవహరిస్తోంది. దీనితో ఉద్యోగాల కోసం కోచింగ్ తీసుకుంటున్న యువత ఏం చేయాల్లో దిక్కు తోచని స్థితిలో పడ్డారు. తమకు వెంటనే నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. చీరాల నియోజవర్గంలోని మున్సిపాలిటీలో 35 వేల నివాసాలు, రూరల్ మండల పరిధిలోని 15 గ్రామాల్లో 25,650 నివాసాలు, వేటపాలెం మండలంలో 24,600 నివాసాలు ఉండగా 40 వేల మంది నిరుద్యోగులు ఉండగా వీరందరూ భృతి కోసం ఎదురు చూస్తున్నారు. అదే విధంగా పర్చూరు నియోజకవర్గంలో పర్చూరు, చినగంజాం, మార్టూరు, యద్దనపూడి, కారంచేడు, ఇంకొల్లు మండలాల్లో దాదాపుగా 90 వేలకు పైగా నివాసాలు ఉన్నాయి. వీటిలో దాదాపుగా 40 వేలకు పైగా నిరుద్యోగులు ఉన్నారు. మరి వీరందరికీ ఎప్పుడు నిరుద్యోగ భృతి అందుతుందోనని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనలు లేకుండా నిరుద్యోగులదరికీ ఇవ్వాలి..

అద్దంకి: కూటమి ప్రభుత్వం తాము అధికారంలోకి రాకముందు, అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు భృతి ఇస్తామని ప్రకటించింది. దాన్ని మేనిఫేస్టోలోనూ పెట్టింది. కూటమిలోని ప్రధాన పార్టీ నేత చంద్రబాబు నాయకుడు అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు భృతి ఇస్తామని పలు బహిరంగ సభల్లో ప్రసంగాలు చేసే సమయంలో హామీ ఇచ్చాడు. ఏ నిబంధన ఉంటుందని చెప్పలేదు. ఏ నిబంధన లేకుండా నిరుద్యోగులకు భృతి ఇవ్వాలని వారు కోరుతున్నారు. నియోజకవర్గంలోని అద్దంకి, బల్లికురవ, జే పంగులూరు, కొరిశపాడు, సంతమాగులూరు మండలాల్లో 44,624 మంది పదో తరగతి నుంచి ఇంటరు, డిగ్రీ, పీజీ పూర్తి చేసి ఉద్యోగం లేకుండా ఉన్న నిరుద్యోగులు ఉన్నారు. వారంతా నిరుద్యోగ భృతి వస్తుందని, వస్తే ఉద్యోగం సంపాదించుకునే లోపుగా వేన్నీళ్లకు చన్నీళ్లలాగా భృతి ఉంటుందని భావిస్తున్నారు.

> **వాగ్దానం అమలు చేయాలి..**
> రాష్ట్రంలో ఎంతో మంది యువతీ, యువకులు ఉద్యోగాలు లేక ఖాళీగా ఉంటున్నారు. నేటి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలలో యువతకు నిరుద్యోగ భృతి ఒకటి ఉంది. దీనిలో భాగంగా ప్రభుత్వం ఈ హామీపై దృష్టి పెట్టాలని కోరుతున్నాం. మొదటి ప్రాధాన్యతగా ఉపాధి కల్పించాలని మా ఆశ. లేకుంటే కనీసం నిరుద్యోగ భృతి అయిన కండీషన్లు లేకుండా ఇవ్వాలి.
> – ఎం సుధీర్‌బాబు, కారంచేడు



> **మాట చెల్లించుకోవాలి..**
> కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకమునుపు పలు సభల్లో, మేనిఫెస్టోలో చెప్పిన ప్రకారం నిరుద్యోగ భృతి ఇవ్వాలి. సంబంధిత జీవోతో హామీని అమలు చేయాలి. నిరుద్యోగ భృతి కోసం నాలాంటి ఎందరో నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారు. చెప్పిన మాట ప్రకారం నిబంధనలు లేకుండా ప్రతి నిరుద్యోగికి భృతి ఇవ్వాలి. మాట నిలబెట్టుకోవాలి,
> – పల్లె ఉదయ్‌కుమార్, ఎమ్‌కాం, పెదఅంబడిపూడి



> **నిరుద్యోగ భృతి త్వరగా ఇచ్చే ఏర్పాటు చేయాలి..**
> నేను ఎంకాం పూర్తిశాను. ఉద్యోగం కోసం ఏదురు చూస్తున్నాను. ఉద్యోగం రాలేదు. కనీసం ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ భృతి ఇచ్చినట్లయితే మాకు కొంత వెసులుబాటుగా ఉంటుంది. కనీసం భృతి ఎప్పటి నుంచి ఇస్తారు. దాని విధివిధాలైనా ముందుగా ప్రకటించాలని కోరుతున్నాం.
> – వెంకటేశ్వరరెడ్డి, పందిళ్లపల్లి



> **నిరుద్యోగ భృతి నాకు ఎంతో ఆసరా..**
> కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగ భృతి వస్తుందని నేను చాలా సంతోషించాను. కాని అది ఇంతవరకు వచ్చిన దాఖలాలే లేవు. భృతి వస్తే మాలాంటి నిరుద్యోగులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. చిన్న పాటి ఉద్యోగానికి దరఖాస్తు చేసుకోవాలన్నా తల్లిదండ్రులను అడగాల్సి వస్తుంది. భృతి వస్తే ఎవరినీ అడగకుండా నా ఖర్చులకు నాకు కొంత ఊరట లభిస్తుంది. డిగ్రీ పూర్తిచేసి ఐదేళ్లు అవుతుంది.
> – తలకాయల సునీల్, పంగులూరు

క్లుప్తంగా

లక్ష్మీ నరసింహుడికి వెండి చామరలు అందజేత



వెండిచామరలను అందజేస్తున్న ఎంపీడీవో సత్యనారాయణ

అద్దంకి: ప్రముఖ పుణ్యక్షేత్రం శింగరకొండ లక్ష్మీ నరసింహస్వామికి సోమవారం ఎంపీడీవో సత్యనారాయణ రెండు వెండి చామరాలను దేవస్థాన అధికారులకు అందజేశారు. అనంతరం ఆయన దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఆయనకు పూజల అనంతరం తీర్థ ప్రసాదాలను అందజేశారు.

18 నుంచి కుష్టువ్యాధిపై ఇంటింటా సర్వే

బల్లికురవ: వాతావరణంలో వస్తున్న మార్పుల వల్ల సీజనల్ జ్వరాలు, వ్యాధులు సోకే ప్రమాదం ఉందని వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది గ్రామాల వారీగా ఇంటింటా సర్వే చేపట్టాలని గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి షేక్ రమీజ్ అహమ్మద్ కోరారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్, అతిసార వ్యాధులకు గ్రామాల వారీగా సర్వేతో వ్యాధిగ్రస్తులను గుర్తించి 104 వాహనం శిబిరాల ఏర్పాటుతో అదుపులోకి తెస్తున్నట్లు చెప్పారు. ఈనెల 18 నుంచి ఆగస్టు 2వ తేది వరకు కుష్టువ్యాధిపై ఇంటింటి సర్వే చేపడుతున్నట్లు చెప్పారు. స్పర్శలేని మచ్చలు, నరాల వ్యాధితో బాధపడుతున్న వారికి వివిధ రకాల పరీక్షలతోపాటు అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్ చేస్తామని వైద్యాధికారి వివరించారు. సర్వే టీమ్‌కు సహకరించాలని వైద్యాధికారి కోరారు.

మొహర్రం వేడుకలు ప్రారంభం

చీరాల: చీరాల మండలం జాండ్రపేటలోని దాదా అమీన్‌పీర్ దర్గా వద్ద మొహర్రం ఉత్సవాలు జరుగుతున్నాయి. ఈసందర్భంగా దర్గా వద్ద ప్రాంగణంలో పీర్లను ప్రతిష్ఠించి ప్రత్యేక ప్రార్ధనలు చేపట్టారు. కమిటీ నిర్వాహకులు మాట్లాడుతూ 22 ఏళ్లుగా మొహర్రం ఉత్సవాలు వైభవంగా జరుపుతున్నామన్నారు. గత సోమవారం నుంచి దర్గా వద్ద ప్రతిరోజు ఉత్సవాలు జరుపుతున్నామన్నారు. 17న మొహర్రం సందర్భంగా పీర్ల ఊరేగింపు ఉత్సవాలు జరుపుతామన్నారు.

కౌలుకార్డులు తప్పనిసరిగా తీసుకోవాలి

దర్శి: కౌలు రైతులు కౌలుకార్డులు తప్పనిసరిగా తీసుకోవాలి ఏఓ బాలకృష్ణ నాయక్ సూచించారు. మండలంలోని బొట్లపాలెం గ్రామంలో రైతు సేవా కేంద్రంలో కౌలుకార్డులపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ కౌలు కార్డు తీసుకోవడం ద్వారా పంట నష్టం జరిగితే నష్ట పరిహారం, పంట బీమా బ్యాంక్ నుంచి సులభంగా పొందవచ్చని చెప్పారు. కౌలు కార్డు కాలపరిమితి 6 నెలలు ఉంటుందన్నారు. కాల పరిమితి ముగిసిన తర్వాత వాటిని రెన్యువల్ చేసుకోవచ్చని తెలిపారు. గ్రామం రెవెన్యూ అధికారి సుధాకర్‌రావు, వ్యవసాయ సహాయకులు షేక్ మాసుమ్ బాజీ, గ్రామ రైతులు పాల్గొన్నారు.

మిషన్ శక్తి సంకల్పంపై అవగాహన

కురిచేడు: స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలోని విద్యార్థులకు మిషన్ శక్తి సంకల్పంపై అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఆర్. నాగమణి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో లాయర్ చెన్నకేశవులు మాట్లాడుతూ విద్యార్థులు, మహిళల కోసం అనేక చట్టాలు ఉన్నాయని, చట్టాల గురించి, సెక్షన్ల గురించి, శిక్షల గురించి వివరించారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, కేజీబీవీ ప్రిన్సిపాల్ పద్మావతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

దాయాదుల మధ్య ఘర్షణ

మార్టూరు: భార్యభర్తల మధ్య జరిగిన ఘర్షణలో మధ్యలో వెళ్లిన వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని రాజుపాలెం గ్రామంలో సోమవారం రాత్రి జరిగింది. అందిన వివరాల మేరకు.. రాజుపాలెం గ్రామ తూర్పు ఎస్సీ కాలనీలో నివాసం ఉండే జానపాటి చిన్న నాగరాజు తన భార్యతో మొదలైన వివాదం ఘర్షణకు దారి తీయగా భార్యపై దాడికి దిగాడు. ఈ క్రమంలో వారి సమీప బంధువు జానపాటి శ్రీను అడ్డురాగా కత్తి శ్రీను చేతికి తగిలి గాయమైంది. గాయపడిన శ్రీనును స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

180 మందికి పింఛన్లు, బియ్యం పంపిణీ

చీరాల అర్బన్: ఆర్యవైశ్య అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ (ఆవోపా) ఆధ్వర్యంలో సోమవారం దివ్యాంగులు, వృద్ధులకు పెన్షన్లు, బియ్యం పంపిణీ చేశారు. స్థానిక ఆవోపా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో దివ్యాంగులు, వృద్ధులు మొత్తం 180 మందికి పెన్షన్లు, బియ్యం పంపిణీ చేసి భోజనం అందించారు. ఆవోపా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు కార్యక్రమాలు ఎంతో మందికి ఉపయోగపడ్డాయని ముఖ్యఅతిథిగా హాజరైన తాతా కుమారస్వామి, లక్ష్మీలు కొనియాడారు. దాతల సహకారంతో ఎన్నో కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఆవోపాను అభినందించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు చైర్మన్ మారుటూరి రాఘవేంద్రరావు, అధ్యక్షులు వలివేటి మురళీకృష్ణ, కార్యదర్శి కోడూరి ఏకాంబరేశ్వరబాబు, కోశాధికారి పేర్ల వెంకట రామయ్య, రమేష్, నాగేశ్వరరావు, సత్యనారాయణ, మస్తాన్‌రావు, భాగ్యలక్ష్మి, సుకన్య తదితరులు పాల్గొన్నారు.



వృద్ధులకు పెన్షన్లు, బియ్యం అందిస్తున్న దాతలు

శింగరకొండ దర్శిని

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయనం, ఆషాఢ మాసం విశాఖ నక్షత్రం, దశమి సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.



ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

అద్దంకి రూరల్: మధ్యాహ్న భోజన కార్మికులు సమస్యలు పరిష్కారించాలని కోరుతూ కార్మికులు సోమవారం ఎంఈవో సుధాకర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ యూనియన్ నాయకులు కోటేశ్వరమ్మ మాట్లాడుతూ మండల పరిధిలో పని చేస్తున్న కొందరు కార్మికులను రాజకీయ నాయకులు ఇబ్బందులు పెడుతున్నారని విధులనుంచి తొలగిస్తామని బెదిరిస్తున్నట్లు చెప్పారు. ఏప్రిల్ నుంచి మెనూ చార్జి బిల్లులతోపాటు రెండు నెలల వేతనం పెండింగ్ ఉందన్నారు. ప్రతినెల వేతన మెనూ బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మికసంఘం నాయకుడు తంగిరాల వెంకటేశ్వర్లు, మిడ్డే మీల్స్ కార్మికులు అక్కమ్మ, చిన్నమ్మాయి, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.



ఎంఈవోకు వినతి పత్రం అందజేస్తున్న మిడ్డే మీల్స్ కార్మికులు

పేద విద్యార్థికి ఆర్థిక సహాయం

అద్దంకి రూరల్: రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు చెన్నుపాటి రామాంజనేయులు విశ్వభారతి జూనియర్ కళాశాలలో జూనియర్ ఇంటర్ చదువుతున్న పేద విద్యార్థి సయ్యద్‌అహ్మద్‌కి కాలేజీ ఫీజుల నిమిత్తం రూ. 15 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, కార్యదర్శి మురళీ సుధాకరరావు, దివాకర దత్తు, మలాది శ్రీనివాసరావు, జ్యోతి చంద్రమౌళి,శాల ప్రిన్సిపల్ శివారెడ్డి, సందిరెడ్డి శ్రీనివాసరావు, పువ్వాడ రామకోటేశ్వరరావు, చెన్నుపల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.



ఆర్థిక సహాయం అందజేస్తున్న రోటరీక్లబ్ సభ్యుడు

తొలిఏకాదశి వేడుకలకు ఆలయాల ముస్తాబు



వేడుకలకు ముస్తాబవుతున్న చెన్నకేశస్వామి ఆలయం

బల్లికురవ: తొలి ఏకాదశి వేడుకలకు మండలంలోని విష్ణు ఆలయాలను ముస్తాబు చేస్తున్నారు. కొణిదెన శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి కొప్పరపాలెం కోదండరామాలయం, చెన్నుపల్లి, కొండాయపాలెం గ్రామాల్లోని సీతారామస్వామి ఆలయాలు కొత్తపాలెం గ్రామంలోని కోదండరామాలయం గుంటుపల్లి రామాలయం, కూకట్లపల్లి, కొత్తూరు, వెలమవారిపాలెం గ్రామాల్లోని రామాలయంలో బుధవారం జరిగే తొలిఏకాదశి వేడుకలకు ముస్తాబు చేస్తున్నారు. ఉదయం 5 గంటల నుంచే స్వామివారికి విశిష్ట పూజలు ప్రత్యేక అలంకరణ చేపట్టనున్నట్లు ఆలయ ధర్మకర్తలు అర్చకులు తెలిపారు. వేడుకల్లో భాగంగా ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించి ముస్తాబు చేస్తున్నారు.

హెల్మెట్ లేకుండా నడిపితే శిక్షార్హులు

చీరాల రూరల్: నూతన చట్టాల ప్రకారం ద్వి చక్రాహనదారులు హెల్మెట్ లేకుండా తమ వాహనాలను నడిపితే శిక్షలకు గురవుతారని చీరాల బార్ అసోసియేషన్ మహిళా ప్రతినిధి, న్యాయవాది జీకే ఈశ్వరిరెడ్డి సూచించారు. ఉన్నత న్యాయస్థానాల ఆదేశాలతో మండల న్యాయ సేవాధికార సంస్థ చీరాల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక పేరాల సెంటర్లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈసదస్సులో న్యాయవాది ఈశ్వరిరెడ్డి పాల్గొని మాట్లాడారు. నూతన చట్టాల ప్రకారం హెల్మెట్ వినియోగం తప్పనిసరి చేసినట్లు చెప్పారు. ఎవరైనా హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త చట్టాల ప్రకారం శిక్షలకు గురవుతారని ఆమె చెప్పారు. కొత్త చట్టాలపై ప్రజలు అవగాహన చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ద్వి చక్రవాహనాలతో పాటు అన్ని రకాల వాహనాలను అతివేగంగా నడిపి అనర్థాలకు గురికావద్దని హెచ్చరించారు. ముఖ్యంగా యువత కొత్త చట్టాలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. సదస్సులో న్యాయవాది రామారావు, పిఎల్‌వీ మతిన్, కోర్టు సిబ్బంది, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.



నూతన చట్టాలపై అవగాహన కల్పిస్తున్న న్యాయవాది ఈశ్వరిరెడ్డి

విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ



స్కూల్ బ్యాగులు అందుకున్న చిన్నారులు

వేటపాలెం: పాఠశాల పూర్వవిద్యార్థులు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు చెందిన 50 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగులు ఉచితంగా అందజేశారు. ఈసందర్భంగా వేటపాలెం రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు బట్టా మోహన్‌రావు మాట్లాడుతూ పందిళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత విద్యార్థుల వసతుల రూపకల్పనకు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. విద్యార్థులు చదువుపై శ్రద్ధ చూపించి బాగా చదివి ఉన్నత స్థితికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల కార్యదర్శి దశరథరామిరెడ్డి, సభ్యులు పృథ్వీరాజు, వీరాంజనేయులు, రామబ్రహ్మం, పోలకం బాలాజీ, హెచ్ఎం ఎస్వీ లక్ష్మి, బాజీవలి, శ్రీమన్నారాయణ, ప్రసాద్, గాయత్రి పాల్గొన్నారు.

తాగునీరు కాలుష్యం కాకుండా చర్యలు

చీరాల: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు, తాగునీరు కాలుష్యం కాకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. సోమవారం ఆర్‌అండ్‌బీ, డ్రైనేజి డీఈ, వేటపాలెం, చీరాల మండలాల ఎంపీడీఓ, పంచాయతీ సెక్రటరీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షాలు ఎక్కువగా కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలేందుకు అవకాశం ఉందని, వాటిని అరికట్టేందుకు వర్షపునీరు పారుదల ఉండేలా చూడాలన్నారు. అలానే తాగునీరు కాలుష్యం కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. అలానే గ్రామాలలో శానిటైజేషన్ ఎప్పటికప్పుడు చేస్తూ ఉండాలన్నారు. మాజీ ఎమ్మెల్యే సజ్జా చంద్రమౌళి 97వ జయంతిని సోమవారం స్థానిక గడియార స్తంభం సెంటర్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కొండయ్య హాజరై ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సజ్జా హేమలత, జి.చంద్రమౌళి, కొతరపు జనార్ధన్, కె.రజని తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

విద్యావ్యాప్తికి నీలం జేమ్స్ కృషి ఎనలేనిది

చీరాల అర్బన్: విద్యావ్యాప్తికి నీలం జేమ్స్ కృషి ఎనలేనిదని స్కూల్ కరస్పాండెంట్ నీలం శామ్యూల్ మోజెస్ అన్నారు. సోమవారం చీరాల బోస్‌నగర్‌లోని నీలం జేమ్స్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల వ్యవస్థాపకులు నీలం జేమ్స్ 33వ వర్ధంతిని పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది ఆయనకు నివాళులర్పించారు. నీలం జేమ్స్ దేశానికి స్వాతంత్ర్యం రాకముందే 1940లో పాఠశాలను స్థాపికంచి వెనుకబడిన ప్రాంతానికి విద్యావ్యాప్తి కోసం అశేషమైన కృషి చేసి ప్రాథమిక పాఠశాల నుంచి యూపీ స్కూల్, ఉన్నత పాఠశాలగా తీర్చిదిద్దారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యారులు పాల్గొన్నారు.



నీలం జేమ్స్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అతిథులు

సర్పంచ్‌ని వేధించిన వారిపై చర్యలు తీసుకోవాలి

నాగులుప్పలపాడు: మండలంలోని ఉప్పుగుండూరు గ్రామ సర్పంచ్ దేవరకొండ జయమ్మ పట్ల పంచాయతీ కార్యదర్శి హరిబాబు వ్యవహరిస్తున్న తీరు దుర్మార్గమని, పంచాయతీ కార్యదర్శిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎరుకుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మోహన్ కుమార్ ధర్మా డిమాండ్ చేశారు. సోమవారం పంచాయతీ కార్యాలయ ఆవరణలో గ్రామ సర్పంచ్ దేవరకొండ జయమ్మ, గ్రామస్తులతో కలిసి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్ కుమార్‌ధర్మా మాట్లాడుతూ ఎరుకుల కులానికి సంబంధించిన వ్యక్తి గ్రామ సర్పంచ్‌గా ఉండటాన్ని ఓర్చుకోలేని పంచాయతీ కార్యదర్శి నిరంతరం సర్పంచ్‌ను చులకనగా మాట్లాడటం, కులం పేరుతో దూషించడం దుర్మార్గమైన చర్యని అన్నారు. ఇప్పటికే గ్రామంలో సర్పంచ్ చేసిన అభివృద్ధి కార్యక్రమాలకు బిల్లులు చెల్లించకుండా అగ్రకులాలకు చెందిన కనగాల శ్రీను, జాలాది సురేంద్ర మాటలు వింటూ సర్పంచ్ దేవకరొండ జయమ్మపై కుల అహంభావం చూపడం దుర్మార్గమన్నారు. ఇప్పటికే గ్రామ పంచాయతీ కార్యదర్శిపై సర్పంచ్ పెట్టిన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును నీరుగార్చడానికి చర్యలు తీసుకోకుండా జాప్యం చేస్తున్నారని దుయ్యబట్టారు. అనంతరం పంచాయతీ సిబ్బందికి ఫిర్యాదు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎరుకుల హక్కుల పోరాట సమితి లీగల్ అడ్వైజర్ ప్రతాప్, నాగయ్య, పాలపర్తి యానాదిరావు, వెంకటేశ్వర్లు, రాంబాబు, కుంభా శ్రీను తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఎస్టీ సంఘ నాయకులు